యాజమాన్యం తదితర వివరాలు

# "జ్యోతి"

ఫారం 4 (8 వ నిబంధన ప్రకారము)

| | | |
|---|---|---|
| ప్రచురణ స్థలం | : | విజయవాడ. |
| ఎంతకాలానికొకసారి | : | మాసపత్రిక. |
| ముద్రాపకుని పేరు | : | వి. వి. రాఘవయ్య, |
| జాతి | : | భారతీయుడు, |
| విలాసము | : | బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ –2 |
| ప్రకాశకుని పేరు | : | వి. వి. రాఘవయ్య, |
| జాతి | : | భారతీయుడు, |
| విలాసము | : | బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ –2 |
| సంపాదకుని పేరు | : | వి. వి. రాఘవయ్య, |
| జాతి | : | భారతీయుడు, |
| విలాసము | : | బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ –2 |
| పత్రిక యజమానులు | : | శ్రీమతి లీలావతి బకింగ్‌హామ్‌పేటపోస్టు విజయవాడ –2 |

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేయుచున్నాను.

విజయవాడ –2,
తే. 1–3–67

(సం) వి. వి. రాఘవయ్య



# విముక్తి

ఉత్త ... ఇంకా బోనులోని పులిలా ప...గిలే నేగడిచి పోయింది గంగులికి. బయట చీకట్లు అలముకుంటున్నకొద్దీ అతని ఆలోచనలో కూడా అంధకారం వ్యాపించింది. దుర్భేద్యమైన జైలు కిటికీ ... అప్పుడప్పుడు మెరుపులు ... మళ్లీ గాఢాంధకారం ... వానజల్లులు. గంగులు విధిని తిట్టుకుంటూ, ముఖం మీద తడిని తుడుచుకున్నాడు.

ఐదు సంవత్సరాలు అదే గదిలో గాలి పీలుస్తున్నాడు. కాని నిజానికి ఆ కాలం అతని ఘోరమైన నేరానికి విధించిన శిక్షలో కొద్దిభాగమే!

'ఈ శిక్ష తన నేరానికి తగిన దేనా?' గొణిగాడు. తనవేళ్ళగుండా యింకా ఆ వెచ్చని నెత్తురు కారుతున్నట్లు అనుభూతి కలిగింది. విచారణ జరిగిన రోజులు ... ఎంత మంది నల్ల కోట్లతో ... భీతిని ప్రతిబింబించే కళ్లు వందలకొద్దీ తనవైపు, ... చేతులు ఒక విధమైన తృప్తితో నలుపుతున్నాడు.

నిరాశ మళ్లీ కదిలింది. పగ మనసంతా నిండింది. తప్పించుకోవాలి ... తన భవిష్యత్తును నాశనం చేసినవాళ్లను తనునాశనం చేయాలి. జ్వరంతో వణికినట్లు వణికింది అతని శరీరం. పచార్ల వేగం హెచ్చింది ... నుదుటి నుంచి చెమట ...

మళ్లీ పెద్ద మెరుపు ... ఎన్నడూ లేనంత కాంతి తన చీకటి గదిలో.

అతనిదృష్టి హఠాత్తుగా మూల గోడకు వున్న పెద్ద రాతిమీద పడింది. తన కళ్లు తన్ను మోసం చేస్తున్నాయా? నిజంగా ఆ రాతి చుట్టూవున్న పగులునే చూస్తున్నాడా? కాలి వేళ్ళమీద నడిచాడు. తొందరగా క్రిందికిజారి ఆ రాతిచుట్టూ తడుముతున్నాడు. వేళ్ళకు రక్తం చిమ్మేలా ఉద్రేకంతో తడుముతున్నాడు రాతి పగులు చుట్టూ ...

అరే! ఆ రాతి చుట్టూ వున్న పగులు చాలా లోతైనదే. రాయికూడా వదులుగా ఉందే! ఒక్క పట్టుపట్టాడు. వేళ్ళ నుండి చర్మం తొలిగి పోతున్నట్టుంది. కదిలింది. రాతిని బలంగా తొలగించి వెంటనే పక్కన పడేసి ... అది వదిలిన చిక్కని చీకటిలోకి చూశాడు ... మళ్లీ మెరుపు ... ఆశ! రాయి తీసినచోట క్రిందికి మార్గం కనిపించింది.

---

మొదటి బహుమతి రూ. 50

ఇనకొల్లు రవిప్రసాద్
పి. యు. సి., బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కాలేజి, బాపట్ల

అక్కడే ... రాయి తీసిన జాగాలో కాగితం మడత ... కాలంతో పాటు మాసిపోయినట్లుంది ... వణుకుతున్న కాళ్లతో కిటికీ వైపు పోతున్నాడు. ఇంకా దగ్గరికి ... కాగితంమీదికి పల్చని వెలుగు జైలు లాంతరునుంచి దూకింది. ఏదో సందేశం ... ముదురురంగు ద్రవంతో వ్రాసివుంది ... చదివాడు ... అమసక వెల్తురులో ... 'నేను తప్పించుకు పోయిన మార్గం యిదే — దీన్ని కనిపెట్టినవాడు నాయంత అదృష్టవంతుడు'.

బయట సెంట్రీ అడుగుల చప్పుడు. గంగులు పక్కన పెట్టిన రాతివేపుదూకి దానిని పూర్తిగా తన శరీరంతో కప్పివేశాడు. అడుగుల చప్పుడు దూరమైంది. వెంటనే తన తల, భుజాలతోసహా ... ఆ యిరుకు దారిలో దూరాడు ... పాము దూరినట్లు — పురుగు దొలిచినట్లు ... తొడలవెనక్కి చేతులతో ... మళ్లీ రాతిని యథాప్రకారంగా జరిపాడు.

సొరంగంపక్క గోడలు తడిగా చల్లగా తగుల్తున్నాయి. ... ములుకుల్లాంటి రాతి అంచులు బట్టలను, శరీరాన్ని చీలుస్తున్నట్లుయింది. ఇదేమీ గంగులు గమనించినట్లు లేదు. అతని కళ్లలో మెరుపు ... పారిపోతున్నాడు. తను తప్పించుకు పారిపోతున్నాడు. రక్తసిక్తాలైన వేళ్లను ఆ బురదలో వెనక్కి గుచ్చుతూ ... శరీరాన్ని వానపాములా ... పాములా ... పొట్ట మీదుగా నెట్టుకు పోతున్నాడు.

పోతున్నకొద్దీ దారి లోతుకి దిగుతున్నట్లుంది. క్రిందికి వంగి పోతున్నది. గోడలు ... తడి ... మట్టి వాసన ... కొనదేలిన అంచులతో రాళ్లు అతని మాంసాన్ని రుచి చూస్తున్నాయి. అలాగే నెట్టుకుంటూ పోతున్నాడు. పోతున్నకొద్దీ దారి సన్నబడి పోతున్నది. ఊపిరి తీయడం కష్టమై పోతున్నది ... చీకటి చిక్కబడి పోతున్నది. ఒక్కక్షణం ఆగాడు. ... ఏదో విపరీతమైన భయం దూసుకు పోయింది అతన్ని ... తనగదిలోకి వెడితే మళ్లీ ... వెనక్కి ... పైకి తిరిగి చేరడం అసాధ్యమని గ్రహించాడు. చల్లని వణుకు ... గుండెని ఎవరో చల్లని చేతితో నొక్కివేస్తున్నట్లుయింది. పళ్లు బిగించాడు. ఇంకా ముందుకు, మానవాతీతమైన శక్తితో నిరాశమీదుగా . ప్రాకి పోతున్నాడు.

దారి కనిపించింది ... కాని దీనికి చివర అంటూ లేదేమో ! దారి మళ్లీ వంగినప్పుడు, కనిపించిన దృశ్యంతో అతని ఊపిరి క్షణకాలం ఆగి పోయినట్లుయింది. చంద్రకాంతి ... గుండ్రంగా వెన్నెల పడిన దృశ్యం. ఎంతో దూరం లేదు ... సొరంగం చివరికి వచ్చేశాడు ... విజయం ! ... విముక్తి!

చల్లనిగాలి ముఖం మీదుగా వీచింది. త్వరత్వరగా ముందుకు సాగాడు.

దారి యింకా వంకర అవుతోంది పోతున్నకొద్దీ. తన శరీరం విరుగుతోందా అన్నట్లు వంగ వలసినంత వంకర వచ్చింది. ఏవో వింతైన నల్లని సన్నని నీడలు అతని కళ్లమీదుగా ... వెలుగుమధ్యగా ... ...

ఉన్నట్లుండి జారినట్లైంది శరీరం. ఇంక కొద్దిగజాలే వెళ్లాల్సి వుంది. గంగులు తల ఏదో గట్టిపదార్థాన్ని తాకి అతనిస్పృహతప్పినట్లైంది. ఒక్క క్షణం ... కళ్ళు తెరిచాడు ... ఇనపకడ్డీలు దృఢంగా బిగించిన చట్రంగుండా చంద్రకాంతి....పక్కన ఒక అస్థిపంజరం.

